


# కరపత్రం

SINCE 2014

గురువారం జనవరి 9 2025 | సంపుటి :0 | సంచిక : 88 | - శివప్రసాద్, మేనేజింగ్ ఎడిటర్ | పేజీలు: 4

## విశాఖలో ప్రధాని మోదీకి స్వాగతం పలికిన సీఎం చంద్రబాబు



విశాఖపట్నం: ప్రధాని మోదీకి విశాఖలో ఘన స్వాగతం లభించింది. విశాఖపట్నం విమానాశ్రయానికి చేరుకున్న ప్రధానికి సీఎం చంద్రబాబు, ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. విశాఖలో రూ. 2 లక్షల కోట్లకు పైగా విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు ప్రధాని నరేంద్ర మోదీ శ్రీకారం చుట్టనున్నారు. రైల్వే జోన్, పారిశ్రామిక హబ్, గ్రీన్ హైడ్రోజన్ హబ్, బల్క్ డ్రగ్ పార్క్‌లకు శంకుస్థాపన చేయనున్నారు. సీఎం చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో కలిసి భారీ రోడ్ షో చేయనున్నారు. ప్రధాని పర్యటన దృష్ట్యా ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది. పోలీసులు భద్రతను కట్టుదిట్టం చేశారు.

2లో

## ఎల్‌ఆర్‌ఎస్‌పై కాంగ్రెస్ పార్టీ తన

### అసలు రంగు బయటపెట్టింది.. హరీశ్‌రావు ఆగ్రహం

%ఝుతీఱంష్ట్ర =ఖశీ% ఎ ఎల్‌ఆర్‌ఎస్ (ల్యాండ్ రెగ్యులైజేషన్ స్కీమ్) పేరిట 15 వేల కోట్లు ప్రజల ముక్కు పిండి వసూలు చేసేందుకు ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు తెలిపారు. కాంగ్రెస్ రెండు నాలుకల ధోరణికి ఇది మరో నిదర్శనమని పేర్కొన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ పైన నాడు అడ్డగోలుగా విమర్శలు చేసిన కాంగ్రెస్ పార్టీ నేడు అధికారంలోకి రాగానే అసలు రంగు బయటపెట్టిందని విమర్శించారు.



%"డబ్బులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతుంటే ఎల్‌ఆర్‌ఎస్ పేరిట డబ్బులు దండుకునేందుకు ప్రభుత్వం సిద్ధమైంది. మేము అధికారంలోకి వస్తే ఎల్‌ఆర్‌ఎస్ ఉచితంగా అమలు చేస్తా"మని గతంలో కాంగ్రెస్ నేతలు మాటలు చెప్పారని హరీశ్‌రావు గుర్తుచేశారు. ఇప్పుడేమో ఎల్‌ఆర్‌ఎస్ కోసం రెండు రోజులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి ప్రజల నుంచి సొమ్మును దండుకునే కార్యక్రమానికి తెర లేపడం సిగ్గుచేటు అని విమర్శించారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం ఎల్‌ఆర్‌ఎస్ ను ఉచితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

రియల్ ఎస్టేట్ త్వరలో పుంజుకుంటుందని స్వయంగా రెవెన్యూ శాఖ మంత్రి ప్రకటించడం అంటే రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందనే కదా అర్థమని హరీశ్‌రావు ప్రశ్నించారు. కాంగ్రెస్ అస్తవ్యస్త పాలన వల్ల రియల్ ఎస్టేట్ కుదేలైందని మేం ముందు నుంచే చెప్తుంటే బుకాయిస్తున్న కాంగ్రెస్ నాయకులు ఇప్పుడు ఏమని సమాధానం చెబుతారని నిలదీశారు. ప్రశ్నిస్తే కేసులు పెట్టడం దాడులు చేయడం మానేసి అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. దారి తప్పిన పాలనను గాడిలో పెట్టే ప్రయత్నం చేయండని సూచించారు.

## ఏసీబీ విచారణ..

### కేటీఆర్ వెంట న్యాయవాది వెళ్లేందుకు హైకోర్టు అనుమతి



**ఏసీబీ విచారణకు మాజీ మంత్రి కేటీఆర్ వెంట న్యాయవాదిని తీసుకెళ్లేందుకు తెలంగాణ హైకోర్టు అనుమతి ఇచ్చింది. కేటీఆర్ దాఖలు చేసిన లంచ్‌మోషన్ పిటిషన్‌పై ఉన్నత న్యాయస్థానంలో వాదనలు జరిగాయి.**

2లో

హైదరాబాద్: తొలుత పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రభాకర్‌రావు వాదనలు వినిపిస్తూ కేటీఆర్‌తో సహా న్యాయవాదిని ఏసీబీ విచారణకు అనుమతించాలని కోరారు. డిజేబుల్ డిస్టెన్స్‌లో ఉండేలా అనుమతి ఇవ్వాలని కోరారు. గతంలో సుప్రీంకోర్టు సైతం ఓ కేసులో లాయర్ అనుమతికి తీర్పు వెలువరించిందని తెలిపారు. ఏసీబీ తరఫున అదనపు అడ్వొకేట్ జనరల్ తేరా రంజిత్ రెడ్డి వాదనలు వినిపిస్తూ న్యాయవాదిని అనుమతించవద్దని కోర్టును కోరారు. లాయర్‌ను అనుమతిస్తే

## ఫార్ములా ఈ-రేసు కేసు..

### ఏసీబి విచారణకు హాజరైన అర్వింద్ కుమార్



హైదరాబాద్: ఫార్ములా ఈ-రేసు కేసులో ఐఏఎస్ అధికారి అర్వింద్ కుమార్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఈ కేసులో ఆయన ఏ2గా ఉన్నారు. నిధుల బదలాయింపులో ఆయన కీలకంగా వ్యవహరించినట్లు ఆరోపణలున్నాయి. తన పరిధిలో ఉన్న హెచ్ఎండీఏ నుంచి ఎఫ్ఈవో(ఫార్ములా-ఈ ఆపరేషన్స్)కు హెచ్ఎండీఏ చీఫ్ ఎగ్జిక్యూటివ్ బీఎల్ఎన్ రెడ్డి ద్వారా నిధులు బదిలీ చేసినట్లు సమాచారం.

## ఏఐసీసీ ఫేక్ న్యూస్ పెడ్లర్లతో నిండిపోయింది: కేంద్ర మంత్రి బండి సంజయ్



హైదరాబాద్: ఏఐసీసీ ఫేక్ న్యూస్ పెడ్లర్లతో నిండిపోయిందని కేంద్ర మంత్రి బండి సంజయ్ ఆరోపించారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్' వేదికగా తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ మహిళలు కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా లబ్ధి పొందలేదన్నారు. సాధికారత కల్పించడానికి బదులుగా వారిపై దాడుల చేశారని, ఇళ్లను పడగొట్టారని ఆరోపించారు. ఇది పాలన కాదు.. మహిళలపై వ్యవస్థీకృత క్రూరత్వం అని మండిపడ్డారు.

"తెలంగాణలో ఏడాది వినాశకరమైన కాంగ్రెస్ పాలనలో అత్యాచార కేసులు 28.94 శాతం, మహిళల హత్యలు 13 శాతం, కిడ్నాప్‌లు 26 శాతం పెరిగాయి. ఆ పార్టీ వాగ్దానం చేసిన భద్రత ఎక్కడ ఉంది? మహిళల ప్రాథమిక గౌరవం కూడా దాడికి గురవుతోంది. కాంగ్రెస్ హయాంలో 10 వేల మంది బహిరంగ ప్రదేశాల్లో వేధింపులకు గురయ్యారు. కాంగ్రెస్.. దోపిడీదారులు, విధ్వంసకారులు, అబద్ధాల పార్టీగా మారింది" అని బండి సంజయ్ పేర్కొన్నారు.

## కేటీఆర్ ఏసీబి విచారణ..

### ఆడియో, వీడియో రికార్డుకు హైకోర్టు నిరాకరణ

- ఏసీబీ విచారణకు మాజీ మంత్రి కేటీఆర్ వెంట న్యాయవాదిని తీసుకెళ్లేందుకు తెలంగాణ హైకోర్టు అనుమతించింది.
- విచారణ ఆడియో, వీడియో రికార్డు చేసేందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది.
- ఏసీబీ విచారణకు వెళ్లే సమయంలో తన వెంట న్యాయవాదిని అనుమతించేలా ఆదేశాలు ఇవ్వాలంటూ కేటీఆర్ దాఖలు చేసిన లంచ్ మోషన్ పిటిషన్‌పై మంగళవారం హైకోర్టు విచారణ చేపట్టింది.
- విచారణకు వెళ్లే సమయంలో న్యాయవాదిని అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పులను కేటీఆర్ తరఫు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు.



2లో

# నిందితుడు మా మద్దతుదారుడే.. కానీ:

అన్నా యూనివర్సిటీ విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటనపై సీఎం స్టాలిన్ స్పందించారు. ఈ కేసులో నిందితుడు తమ పార్టీ మద్దతుదారుడేనని అంగీకరించారు.

చెన్నై: తమిళనాడు రాజధాని చెన్నైలోని అన్నా యూనివర్సిటీ ప్రాంగణంలో ఓ విద్యార్థినిపై జరిగిన అత్యాచార ఘటన రాష్ట్రంలో పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ఘటనపై తాజాగా స్పందించిన డీఎంకే అధినేత, ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ కేసులో నిందితుడు తమ పార్టీ మద్దతుదారుడేనని అంగీకరించారు.

ఎవరైనా సరే చర్యలు ఉంటాయ్..

"విద్యార్థినిపై అత్యాచార ఘటనలో నిందితుడు డీఎంకే మద్దతుదారుడే. కానీ, పార్టీలో సభ్యుడు కాదు. అతడికి మేము ఎలాంటి రక్షణ కల్పించడం లేదు. ఎందుకంటే.. మహిళల భద్రతే మా ప్రభుత్వానికి ముఖ్యం. ఈ ఘటనపై కేసు నమోదైన కొన్ని గంటల్లోనే నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం దీనిపై విచారణ



కొనసాగుతోంది. ఈ ఘటనతో ప్రమేయం ఉన్న వారి నేపథ్యం ఎలాఉన్నా సరే వారిపై కఠిన చర్యలు తప్పవు" అని స్టాలిన్ స్పష్టం చేశారు.

డీఎంకే నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం మహిళల విషయంలో ఎంతో ఆలోచిస్తోందని.. అందులోభాగంగా వారికి ఉచిత బస్సు ప్రయాణం, రూ.వెయ్యి ఆర్థిక సహాయంతో పాటు ఉన్నత విద్యకు సంబంధించి పథకాలను అమలుచేస్తోందని సీఎం పేర్కొన్నారు. కాగా..

చెన్నై అన్నా విశ్వవిద్యాలయంలో ఇంజినీరింగ్ చదువుతున్న ఓ విద్యార్థిని డిసెంబరు 23న రాత్రి తన స్నేహితుడితో కలిసి వర్సిటీ ప్రాంగణంలో మాట్లాడుతుండగా అక్కడికి ఇద్దరు వ్యక్తులు వచ్చారు.

శీష్ మహల్ వివాదం.. పీఎం నివాసం వద్ద ఆప్– సీఎం నివాసం వద్ద భాజపా..!

ఆమె స్నేహితుడిపై దాడి చేసి అక్కడినుంచి పంపించేశారు. అనంతరం ఆ యువతిపై అత్యాచారానికి పాల్పడ్డారు. ఆమెను ఫొటోలు తీసి, తమపై ఫిర్యాదు చేస్తే వాటిని సామాజిక మాధ్యమాల్లో పెడతామని బెదిరించారు. దీనిపై బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ కేసులో జ్ఞానశేఖరన్ అనే వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ ఘటన రాష్ట్రంలో దుమారం రేపింది. అధికార పార్టీపై ప్రతిపక్షాలు విరుచుకుపడుతున్నాయి. ఈక్రమంలో స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశంగా మారాయి.

# ఏసీబీ విచారణ..

## కేటీఆర్ వెంట న్యాయవాది వెళ్లేందుకు హైకోర్టు అనుమతి

మొదటిపేజీ తరువాయి

న్యాయవాది రామచంద్రరావు కేటీఆర్ వెంట విచారణకు హాజరవుతారని ఆయన తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. కేటీఆర్ విచారణను ఆడియో, వీడియో రికార్డు చేయాలని న్యాయవాది కోరగా.. అందుకు ఉన్నత న్యాయస్థానం నిరాకరించింది. న్యాయవాది లైబ్రరీలో కూర్చుంటే కేటీఆర్ విచారణ కనిపిస్తుందని ఈ సందర్భంగా ఏఏజీ ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. న్యాయవాదితో కలిసి గురువారం ఏసీబీ విచారణకు వెళ్లాలని న్యాయస్థానం కేటీఆర్‌కు సూచించింది. గురువారం విచారణ తర్వాత ఏవైనా అనుమానాలుంటే మళ్లీ న్యాయస్థానాన్ని ఆశ్రయించవచ్చని హైకోర్టు తెలిపింది.ఏసీబీ విచారణకు కేటీఆర్‌తో పాటు వెళ్లేందుకు ముగ్గురు న్యాయవాదుల పేర్లను సూచించాలని.. అందులో ఒకరికి అనుమతిస్తామని హైకోర్టు పేర్కొంది. దర్యాప్తు అధికారి, కేటీఆర్ ఓ గదిలో ఉంటే.. వాళ్లిద్దరూ కనిపించేంత దూరంలో న్యాయవాది ఉండేలా అనుమతి ఇస్తామని హైకోర్టు తెలిపింది. ఈ మేరకు ఏసీబీ కార్యాలయంలో ఏర్పాట్లు ఉన్నాయో లేవో తెలుసుకొని చెప్పాలని అదనపు అడ్వొకేట్ జనరల్‌ను అదేశించింది. ఎంపీ అవినాష్ రెడ్డి సీబీఐ విచారణను ఎదుర్కొనే సమయంలో న్యాయవాదిని అనుమతిస్తూ ఇదే హైకోర్టు సైతం తీర్పు ఇచ్చిందని జస్టిస్ కె.లక్ష్మణ్ అన్నారు. న్యాయవాదిని అనుమతించొద్దని ఏసీబీ తరఫున వాదించిన అదనపు అడ్వకేట్ జనరల్ తేరా రజినీకాంత్ రెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. న్యాయవాదిని అనుమతిస్తే అభ్యంతరమెందుకని.. విచారణ గదిలోకి న్యాయవాది వెళ్లడం లేదు కదా అని హైకోర్టు వ్యాఖ్యానించింది.

కేటీఆర్, దర్యాప్తు అధికారి ఓ గదిలో ఉంటే... వాళ్లిద్దరూ కనిపించేలా మరో గదిలో న్యాయవాది కూర్చుంటారని హైకోర్టు తెలిపింది. ఏసీబీ కార్యాలయంలో తగిన ఏర్పాట్లు ఉన్నాయా లేవా అని ఏఏజీని ప్రశ్నించగా.. వివరాలు సేకరించి చెబుతానని ఏఏజీ సమాధానమిచ్చారు. సాయంత్రం 4 గంటలకు ఉత్తర్వులిస్తామని హైకోర్టు పేర్కొంది. విచారణకు సంబంధించి ఏసీబీ కార్యాలయంలో ఏర్పాట్లపై సమాచారం తెలుసుకున్న తర్వాత జస్టిస్ కె.లక్ష్మణ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

# ఆమ్‌ఆద్మీ పార్టీకి టీఎంసీ మద్దతు..

# 'థాంక్యూ దీదీ' అంటూ కేజ్రీవాల్ ట్వీట్

దిల్లీలో హ్యాట్రిక్ విజయం కోసం శ్రమిస్తోన్న ఆమ్ ఆద్మీ పార్టీకి టీఎంసీ మద్దతు ప్రకటించింది.

దిల్లీ: దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో హ్యాట్రిక్ విజయం కోసం తీవ్రంగా శ్రమిస్తోన్న ఆమ్ ఆద్మీ పార్టీకి తృణమూల్ కాంగ్రెస్ మద్దతు ప్రకటించింది. ఫిబ్రవరి 5న జరగనున్న అసెంబ్లీ ఎన్నికలకు బెంగాల్ సీఎం మమతా బెనర్జీ మద్దతు ప్రకటించినట్లు ఆప్ జాతీయ కన్వీనర్, దిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆమెకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు ఆయన 'థాంక్యూ దీదీ' అంటూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు.

రూ.25 లక్షల ఆరోగ్య బీమా.. దిల్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ హామీ

"దిల్లీ ఎన్నికల్లో ఆప్‌నకు తృణమూల్ కాంగ్రెస్ మద్దతు



ప్రకటించింది. మమత దీదీకి వ్యక్తిగతంగా కృతజ్ఞతలు తెలుపుతున్నా. థాంక్యూ దీదీ. మా మంచి చెడుల్లో మీరు ఎల్లప్పుడూ అండగా నిలిచారు" అని కేజ్రీవాల్ పేర్కొన్నారు. తాజా పరిణామంతో దిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్‌నకు మద్దతుగా నిలిచిన 'ఇండియా' కూటమి మిత్రపక్షాల జాబితాలో తాజాగా ఆప్ చేరడం గమనార్హం. గతంలో సమాజ్‌వాదీ పార్టీ, శివసేన (యూబీటీ) కేజ్రీవాల్‌కు మద్దతు ప్రకటించాయి. గతేడాది జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్‌తో పొత్తు పెట్టుకున్న ఆప్.. ఆ తర్వాత జరిగిన హరియాణా ఎన్నికల్లో ఒంటరి పోరాటం చేసిన విషయం తెలిసిందే. దిల్లీలో మొత్తం 70 అసెంబ్లీ స్థానాలు ఉండగా.. 2015లో 67 స్థానాలు గెలుచుకొని తొలిసారి అధికారంలోకి వచ్చిన ఆప్.. ఆ తర్వాత 2020లో 62 సీట్లతో అధికారం నిలబెట్టుకుని ఇప్పుడు హ్యాట్రిక్ విజయం కోసం కృషిచేస్తోంది.

# ఫార్ములా ఈ-రేసు కేసు..

## ఏసీబీ విచారణకు హాజరైన అర్వింద్ కుమార్

మొదటిపేజీ తరువాయి

అప్పటి మంత్రి కేటీఆర్ ఆదేశాలతోనే నిధులు బదిలీ చేసినట్లు గతంలో అర్వింద్ కుమార్ ప్రభుత్వానికి వివరణ ఇచ్చారు. ఆయన వాంగ్మూలాన్ని ఏసీబీ అధికారులు నేడు రికార్డు చేయనున్నారు.

ఈడీ ముందుకు బీఎల్ఎన్ రెడ్డి

మరోవైపు పార్ములా–ఈ రేసు కేసులో బీఎల్ఎన్ రెడ్డి ఈడీ విచారణకు హాజరయ్యారు. రేసు జరిగినప్పుడు ఆయన చీఫ్ ఇంజినీర్‌గా ఉన్నారు. రూ.45.71 కోట్లు విదేశీ సంస్థకు బదిలీ చేసిన వ్యవహారంలో ఈడీ దర్యాప్తు చేస్తోంది. ఏసీబీ కేసు ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ముమ్మరం చేసింది.

## శీష్ మహల్ వివాదం.. పీఎం నివాసం వద్ద ఆప్- సీఎం నివాసం వద్ద భాజపా..!



ఎన్నికల తేదీ దగ్గరపడుతోన్న కొద్దీ దిల్లీ రాజకీయాలు కొత్త మలుపు తిరుగుతున్నాయి. ఒకరి లోపాలను మరొకరు ఎత్తిచూపేందుకు ఆప్–భాజపా తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయి.

ఇంటర్నెట్‌డెస్క్: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తోన్న తరుణంలో దిల్లీ రాజకీయాలు వేడెక్కాయి. ఆప్, భాజపా ఏ వేదికా వదలకుండా విమర్శలు చేసుకుంటున్నాయి. ఈ సమయంలో 'సీఎం బంగ్లా' వివాదం రాజకీయ దుమారం రేపుతోంది. ఈ బంగ్లాను 'శీష్ మహల్ (అద్దాల మేడ) అంటూ భాజపా చేస్తోన్న విమర్శలను ఆప్ తిప్పికొడుతోంది. తాజాగా 'నిజాన్ని చూపిస్తాం' అంటూ ఆ పార్టీ సంజయ్ సింగ్, సౌరభ్ భరద్వాజ్ మీడియాను తీసుకొని ఆ అధికారిక నివాసం వద్దకు వెళ్లారు. అయితే వారి ప్రయత్నాన్ని పోలీసులు అడ్డుకున్నారు. మంత్రి, ఎంపీ అధికారాలను పోలీసులు అడ్డుకుంటున్నారని ఆప్ నేతలు మండిపడ్డారు. దాంతో సీఎం నివాసం ముందు గందరగోళ వాతావరణం నెలకొంది .

ఆ అధికారిక నివాసంలోకి వెళ్లేందుకు ఆప్ నేతలకు అనుమతి లేదని పోలీసులు తేల్చిచెప్పారు. దానిలోభాగంగా బారికేడ్లు ఏర్పాటుచేశారు. భారీగా పోలీసులను మోహరించారు. "ఎవరినీ లోపలికి అనుమతించొద్దంటూ పైనుంచి ఆదేశాలు వచ్చాయని పోలీసులు చెప్పారు. ఈ పోలీసు చర్య భాజపాకు సంతోషాన్ని కలిగిస్తుంది" అని సౌరభ్ విమర్శించారు. తర్వాత సింగ్‌తో పాటు కొద్దిసేపు ధర్నాకు కూర్చొని.. ప్రధాని అధికారిక నివాసం ఉన్న లోక్‌కల్యాణ్ మార్గ్ వైపు వెళ్లారు. పీఎం నివాసం సమీపంలోనే పోలీసులు వారిని అడ్డుకున్నారు. మరోవైపు ఆప్‌నకు కౌంటర్‌గా భాజపా దిల్లీ సీఎం అధికారిక నివాసం వద్దకు వెళ్లినట్లు తెలుస్తోంది.

దిల్లీలోని 6 ఫ్లాగ్ స్టాఫ్ రోడ్‌లో ఉన్న ప్రభుత్వ బంగ్లాను అరవింద్ కేజ్రీవాల్ సీఎంగా ఉన్న సమయంలో అధికారిక నివాసంగా వినియోగించారు. ఈ బంగ్లాను 'శీష్ మహల్ (అద్దాల మేడ)'గా భాజపా అభివర్ణిస్తోంది. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసి ఆయన 7–స్టార్ రిసార్ట్‌గా మార్చుకున్నారని విమర్శించింది. దీనికి కౌంటర్‌గా పీఎం నివాసాన్ని 'రాజ్ మహల్' అంటూ విమర్శలు చేస్తోంది.

# స్వదేశీ విమానాల ద్వారా వెదర్ డేటా..!

దిల్లీ: వాతావరణ సమాచార సేకరణ అంశంపై కేంద్ర ప్రభుత్వం సరికొత్త ప్రణాళిక రచిస్తోంది. ఇకపై స్వదేశీ విమానాల సాయంతో వాతావరణ పరిస్థితికి సంబంధించిన సమాచారాన్ని స్వీకరించేలా యోచిస్తోంది. విమానాలు ఆ డేటాను భారత వాతావరణ శాఖ (ఐఎమ్‌డీ)తో తప్పనిసరిగా పంచుకునేలా చర్యలు చేపట్టబోతోంది.

"నిత్యం దేశంలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్న స్వదేశీ విమానాలు.. వాతావరణ సమాచారాన్ని సేకరిస్తూ ఉంటాయి. టేకాఫ్, ల్యాండింగ్ సమయాల్లో వాతావరణ పరిస్థితిపై కచ్చితమైన సమాచారంతో ప్రయాణిస్తుంటాయి. ఈ సమాచారాన్ని తప్పనిసరిగా భారత వాతావరణ శాఖతో పంచుకునేలా కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక రచిస్తోంది. దీంతో ముందస్తు వాతావరణ సూచనను మరింత మెరుగుపరిచే అవకాశం ఉంటుంది" అని భూ విజ్ఞాన మంత్రిత్వశాఖ సీనియర్ అధికారి ఎం.రవిచంద్రన్ పేర్కొన్నారు.



"ప్రస్తుతం దేశంలో విమాన సేవలు విస్తరించాయి. ప్రతి రాష్ట్రంలో 10 నుంచి 15 ఎయిర్‌పోర్టులు ఉన్నాయి. అన్ని దేశీయ విమానయాన సంస్థలు ఈ డేటాను అందించగలిగితే మన సామర్థ్యాలు అంచనాలకు మించి ఉంటాయి" అని అన్నారు. ఈ అంశంపై త్వరలో పౌర విమానయాన మంత్రిత్వశాఖతో చర్చలు జరుపుతున్నామని ఆయన వెల్లడించారు.

# 'భారత్ భూభాగం ఆక్రమణ' బంగ్లాదేశ్ దళం కాకమ్మ కథ: బీఎస్ఎఫ్

భారత్‌లో 5 కిలోమీటర్ల మేరకు భూభాగాన్ని బంగ్లాదేశ్ సైన్యం ఆక్రమించుకొందన్న మీడియా కథనాలను సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) తిరస్కరించింది. అవి పూర్తిగా బాధ్యతారాహిత్యమైన, ఆధార రహిత కథనాలని పేర్కొంది.

"నార్త్ 24 పరగణాస్ జిల్లాలో రాంఘాట్ గ్రామంలోని బగ్దా బ్లాక్‌లోని భూభాగంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇక్కడ అంతర్జాతీయ సరిహద్దు కొడల్యా నదీ తీరం నుంచి వెళుతుంది. ఇరువైపులా కచ్చితమైన హద్దులను గుర్తించి స్తంభాలు పాతి వేసిన కంచె ఉంది. ఇక ఈ సరిహద్దు వెంట బీఎస్ఎఫ్ గస్తీలో ఎటువంటి మార్పు జరగలేదు.



ఒక్క అంగుళం భారత భూభాగాన్ని తీసుకోలేదు, తీసుకోలేరు కూడా. 1975 భారత్ బంగ్లా బోర్డర్ గైడ్‌లైన్స్ ఆధారంగా బీఎస్ఎఫ్, బీజీబీ వాటి విధులను ప్రశాంతంగా నిర్వహిస్తున్నాయి" అని బీఎస్ఎఫ్ దక్షిణ బెంగాల్ ఫ్రంటియర్ పేర్కొంది. అంతేకాదు.. కంచె లేని చోట్ల కూడా బంగ్లాదేశీల చొరబాట్లు, స్మగ్లింగ్ వంటివి జరగకుండా కఠినచర్యలు తీసుకొన్నట్లు బీఎస్ఎఫ్ వివరించింది.

బంగ్లాదేశ్‌కు చెందిన మీడియాలోని కొన్ని వర్గాలు నిరాధారంగా వీటిని ప్రచారం చేస్తున్నాయని బీఎస్ఎఫ్ అభిప్రాయపడింది. అంతేకాదు.. బోర్డర్ గార్డ్స్ బంగ్లాదేశ్ (బీజీబీ) మోటార్ బోట్లు, ఏటీవీలతో డిసెంబర్ 19 నుంచి గస్తీ మొదలుపెట్టిందన్న ప్రచారాన్ని కూడా కొట్టిపారేసింది.

బీఎస్ఎఫ్‌తో బంగ్లా గార్డ్స్ గొడవ..

మాల్దా జిల్లాలో సుక్‌దేబ్‌పుర్‌లో సరిహద్దుల వెంట బీఎస్ఎఫ్, బీజీబీ గార్డ్స్‌కు మధ్య ఫెన్సింగ్ విషయంలో గొడవ జరిగింది. భారత్ వైపు కంచె నిర్మాణానికి బంగ్లాదేశ్ అభ్యంతరం వ్యక్తంచేసింది. ఆ తర్వాత కొద్దిసేపటికే అక్కడ గ్రామాల్లో ప్రజలు చేరుకొని వందేమాతరం, భారత్ మాతాకీ జై వంటి నినాదాలు చేశారు. ఆ తర్వాత బీఎస్ఎఫ్ దళాలు స్పందిస్తూ ముందస్తుగా ఇరుదేశాలు చేసుకొన్న ఒప్పందం ప్రకారం దానిని నిర్మిస్తున్నట్లు బీజీబీకి నచ్చజెప్పారు. ఆ తర్వాత తిరిగి కంచె పనులు మొదలుపెట్టారు.

## ఇష్టం లేని పెళ్లి చేసుకుందని.. విందు భోజనంలో



## విషం కలిపి!

తన మేనకోడలు ఇష్టం లేని వివాహం చేసుకుందని కోపంతో ఓ వ్యక్తి.. ఆమె రిసెప్షన్ విందు భోజనంలో విషం కలిపాడు.

ముంబయి: వివాహ రిసెప్షన్‌లో ఓ వ్యక్తి దుశ్చర్యకు పాల్పడ్డాడు. అతిథుల కోసం ఏర్పాటు చేసిన విందు భోజనంలో విషం కలిపాడు. తన మేనకోడలు తనకు ఇష్టం లేని పెళ్లి చేసుకోవడమే అందుకు కారణం. ఈ ఘటన మహారాష్ట్రలోని కొల్హాపుర్ జిల్లాలో చోటు చేసుకుంది.

జిల్లాలోని ఉత్రే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఈ ఘాతుకానికి పాల్పడ్డాడు. తన ఇంట్లోనే పెరిగిన మేనకోడలు మరో వ్యక్తిని ప్రేమించి వివాహం చేసుకుంది. తనకు ఇష్టం లేని పెళ్లి చేసుకోవడంతో ఆమెపై కోపం పెంచుకున్నాడు. ఇటీవల మేనకోడలి పెళ్లి రిసెప్షన్‌కి వెళ్లిన అతడు ఈ దుశ్చర్యకు పాల్పడ్డాడు. అతిథుల కోసం ఏర్పాటు చేసిన వంటకాల్లో విషం కలిపాడు. ఇది గమనించిన కొందరు అతడిని అడ్డుకున్నారు.

శీష్ మహల్ వివాదం.. పీఎం నివాసం వద్ద ఆప్– సీఎం నివాసం వద్ద భాజపా..!

సమాచారం అందడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. కానీ, అప్పటికే నిందితుడు పారిపోయాడు. ఆ ఆహార పదార్థాలను ఎవరూ తినకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు పరారీలో ఉన్న నిందితుడి కోసం గాలింపు చేపట్టారు. ఆహార పదార్థాలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు.

## రూ.25 లక్షల ఆరోగ్య బీమా.. దిల్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ హామీ

దేశ రాజధాని దిల్లీ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈక్రమంలో కాంగ్రెస్ దిల్లీ వాసులకు హామీల వర్షం కురిపిస్తోంది.

తాజాగా 'జీవన్ రక్ష యోజన' అనే పథకాన్ని కాంగ్రెస్ ప్రవేశపెట్టింది. ఈ పథకం ద్వారా ఒక్కో కుటుంబానికి రూ.25లక్షల ఆరోగ్యబీమా కల్పిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. కాంగ్రెస్ సీనియర్ నేత, రాజస్థాన్ మాజీ సీఎం అశోక్ గహ్లోత్ బుధవారం ఈ పథకాన్ని ప్రవేశపెట్టారు. రాజస్థాన్‌లో తాము అధికారంలో ఉన్నప్పుడు ఇదే పథకాన్ని అమలుచేశామని గుర్తుచేశారు. ఎలాంటి షరతులు, పరిమితులు లేకుండా దీన్ని అమలుచేసినట్లు తెలిపారు. దిల్లీకి ఈ పథకం ఓ గేమ్‌ఛేంజర్ అవుతుందని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే 'ప్యారీ దీదీ యోజన' పథకం కింద ప్రతి మహిళకు ప్రతి నెలా రూ.2,500 ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.

ఇదిలాఉండగా.. దేశ రాజధాని దిల్లీలో జరిగే ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం మంగళవారం షెడ్యూల్ విడుదల చేసింది. మొత్తం 70 శాసనసభ స్థానాలకు ఫిబ్రవరి 5న ఎన్నికలు జరగనున్నాయి. ఫిబ్రవరి 8న ఫలితాలు వెలువడనున్నాయి.

# మెట్రో.. ఐటి పార్క్ లతో

# మేడ్చల్ కు మహర్దశ

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

ఒక నాడు మేడ్చల్ హైద్రాబాద్ కు దూరంగా విసిరేసినట్టు ఉండేది. హైవే 44 లో ఉన్న మేడ్చల్ దాటి కండ్లకోయ, కొంపల్లి, బోయిన్ పల్లి దాటితే సికింద్రాబాద్ హైదరాబాద్ శివారు లోనికి వచ్చేవారు. హైద్రాబాద్ అభివృద్ధి చెంది ఇప్పుడు నలువైపులా మహానగరంగావిస్తరించింది. హైద్రాబాద్ కు ఉత్తరాన ఉన్న ప్రాంతాలు ఇప్పుడు నగరశోభ సంతరించుకున్నాయి. కొంపల్లిలో, గుండ్ల పోచంపల్లిలో అధునాతన హంగులు ఏర్పడ్డాయి. కాలేజీలు,హాస్పిటల్లు,నగల,బట్టల దుకాణాలు,షాపింగ్ మాల్స్, అమ్యూస్ మెంట్ పార్కులు,మల్టీప్లెక్స్ లు ఇలా అన్ని రకాల సౌకర్యాలు కలిగాయి. మేడ్చల్ మున్సిపాలిటీ కూడా ఈ సౌకర్యాలతో విలసిలుతున్నది. అంతేకాదు పారిశ్రామిక, రియల్ ఎస్టేట్ రంగాల్లో వేగంగా వృద్ధిచెందింది. ఉత్తర హైదరాబాద్ కు మేడ్చల్ ఒక హబ్ గా రూపొందింది. అయితే, పెరిగిన ట్రాఫిక్ తో మేడ్చల్ నుండి హైదరాబాద్ ప్రయాణించే వారికి ఇబ్బందులు కలుగుతున్నాయి. కాశ్మీర్ నుండి కన్యాకుమారి వరకు సాగే




ఈ హైవే దేశంలో అతి పొడవైన జాతీయ రహదారి. ఈ హైవేలో కీలక ప్రదేశంలో మేడ్చల్ ఉంది. మేడ్చల్ ద్వారా హైదరాబాద్ చేరుకునే వారికి, కార్లు, ట్రక్ లకు,ఇతర హెవీ వెహికల్స్ కు ఈ ట్రాఫిక్ రద్దీ వల్ల తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. విపరీత రద్దీ వల్ల స్థానికులకు, బయటి ప్రాంతాల నుండి వచ్చేవారికి ఎదురవుతున్న ట్రాఫిక్ కష్టాలనుండి విముక్తి కలగాలని ప్రజలు మెట్రో రైల్ కొరకు ఉద్యమాలు నిర్వహించారు. మెట్రో సాధన సమితి ఏర్పాటు చేసుకొని అన్ని పార్టీలవారు ధర్నాలు,రాస్తారోకోలు చేసారు. మొత్తానికి ఉత్తర హైదరాబాద్ కు మెట్రో రైల్ సౌకర్యం కల్పించబోతునట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ప్రకటించారు. ఈ ప్రకటనతో మేడ్చల్ తో పాటు ఉత్తర హైదరాబాద్ ప్రాంత ప్రజలందరూ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నారు. జెబిఎస్ బస్ స్టేషన్ నుండి శామీర్ పేట్ వరకు 22 కి.మీ.లు..ప్యారడైజ్ నుండి మేడ్చల్ వరకు 23 కి.మీ ల మెట్రో రైల్ ఏర్పాటుకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం అనుమతులు ఇవ్వడంతో ఉత్తర హైదరాబాద్ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వీటితో పాటు రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం నుండి ఫ్యూచర్ సిటీ మెట్రో 40 కి.మీ. మేర అనుమతులు ఇస్తున్నట్టు ముఖ్యమంత్రి ప్రకటించారు. ఈ మార్గాల్లో భూ సేకరణను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఆయా ప్రాంతాల్లో ఎలివేటెడ్ కారిడార్ల విషయంలో భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకోవాలన్నారు. ఎలైన్‌మెంట్ రూపొందించేటప్పుడే క్షేత్ర స్థాయిలో సమగ్ర పరిశీలన చేయాలన్నారు. మేడ్చల్ మెట్రో ఎలైన్‌మైంట్ వస్తున్న జాతీయ రహదారిలో ఇప్పటికే ఉన్న మూడు ఫ్లైఓవర్లను దృష్టిలో ఉంచుకొని మెట్రో లైన్ తీసుకెళ్లాలన్నారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణాన్ని సాధ్యమైనంత త్వరగా ప్రారంభించాలన్నారు. శామీర్‌పేట్, మేడ్చల్ మెట్రోలు ఒకే చోట ప్రారంభమయ్యేలా చూడాలని రేవంత్ రెడ్డి సూచించారు. అక్కడ అధునాతన వసతులు, భవిష్యత్ అవసరాలకు తగినట్లు భారీ జంక్షన్లు ఏర్పాటు చేయాలన్నారు. జంక్షన్లకు సంబంధించిన పూర్తి ప్రణాళికలను తయారు చేయాలన్నారు. హైదరాబాద్ గ్రోత్ కారిడార్ లిమిటెడ్ (హెచ్.జి.సి.ఎల్) కింద రేడియల్ రోడ్ల నిర్మాణం చేపట్టాలని అధికారులకు సూచించారు. ఉత్తర హైదరాబాద్ ప్రజల కల నెరవేర్చడానికి కృషి చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం పట్ల రియల్ ఎస్టేట్ కంపెనీలు,పారిశ్రామిక వేత్తలు, హోటల్ యాజమాన్యాలు, ప్రభుత్వ ప్రైవేట్ ఉద్యోగులు, విద్యార్థులు,అన్ని వర్గాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.




## రోడ్ సేఫ్టీ పై కోరుట్ల పోలీసుల అవగాహన ర్యాలీ



**ఆకుల రంజిత్,కరపత్రం ప్రతినిధి**



రోడ్ సేఫ్టీ పై కోరుట్ల పోలీసులు నిన్న బుధవారం ప్రజల్లో విద్యార్థుల్లో అవగాహన కలిగించారు. వాహన దారులు ట్రాఫిక్ నిబంధనలు ఎలా పాటించాలో తెలిపారు. ముఖ్యంగా టూ వీలర్ నడిపేవారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. తదనంతరం ప్రైవేట్ పాఠశాల విద్యార్థులతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు జనం కూడా పాలుపంచుకున్నారు. ఈ రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమంలో కోరుట్ల ఇంచార్జ్ సిఐ గా ఉన్న మెటుపల్లి సిఐ శ్రీ నిరంజన్ రెడ్డి గారితో పాటు,కోరుట్ల ఎస్సై శ్రీ శ్రీకాంత్ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ప్రజలను భాగస్వాములుగా చేసే ఇటువంటి కార్యక్రమాలతో,ఫ్రెండ్లీ పోలీసింగ్ తో ప్రజల్లో సహృద్భావ వాతావరణం ఏర్పడుతుందని అందరూ ఆనందం వ్యక్తం చేసారు.

## అక్రమ రవాణా చేస్తున్న ఇసుక లారీ డ్రైవర్ పై యజమానిపై కేసు నమోదు.

– మెట్పల్లి సీఐ నిరంజన్ రెడ్డి.

**కరపత్రం ప్రతినిధి, మెట్ పల్లి, జనవరి 8.**

ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను రవాణా చేస్తున్నారన్న పక్కా సమాచారంతో బుధవారం ఉదయం రెవెన్యూ శాఖ, పోలీసు శాఖ కలిసి మెట్పల్లి శివారులోని మారుతి నగర్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా లారీ మేడిపల్లి నుండి నిజామాబాదు వైపు వస్తుండగా లారీని ఆపి తనిఖీ చేసినట్లు సీఐ నిరంజన్ రెడ్డి తెలిపారు. గత కొన్ని రోజులుగా లారీలో ఎలాంటి అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తున్నట్లు డ్రైవర్ దిలీప్ నువ్వు విచారించగా లారీ యజమాని రాజన్న అని తెలిపినట్లు సీఐ అన్నారు. అటు లారీని ఇసుకతో యుక్తంగా పంచనామా రాసి రెవెన్యూ శాఖ వారు మెట్పల్లి పోలీస్ స్టేషన్ తీసుకొని వచ్చి మెట్పల్లి ఎస్సై కిరణ్ కుమార్ అట్టి లారీ డ్రైవర్ పై, లారీ యజమాని రాజన్న పై కేసు నమోదు చేసి చేపట్టినట్లు సిఐ నిరంజన్ రెడ్డి అన్నారు. ఇకనుండి ఇసుకను ట్రాక్టర్ లో గాని, లారీలో గాని నింపుగా వచ్చిన వారిని పట్టుకుని కఠినంగా శిక్షిస్తామని హెచ్చరించినట్లు సిఐ నిరంజన్ రెడ్డి అన్నారు.

## ఇబ్రహీంపట్నం మండల ఎర్ర సూర్యుల అస్తమయం

**ఆకుల రంజిత్,కరపత్రం ప్రతినిధి**

వేములకుర్తి గ్రామానికి చెందిన అల్లంకొండ రాజన్న అలుపెరుగని,రాజీలేని కమ్యూనిస్టు నాయకుడు. మొన్న దేహం చాలించాడు. సిపిఐ సిద్ధాంతాలతో ప్రభావితమై, ఎర్ర జెండా ను మోసిన మెదటి తరం వ్యక్తులలో అంకతి రాజన్న గారు వారి సహచర కామ్రేడ్లు అల్లంకొండ రాజన్న, మాలెపు శివరాజం, జిల్లా చిన్న గౌడ్, ఆరె గంగాంధర్ లు ముఖ్యులు. వీరందరికీ మార్గదర్శకులు కోరుట్లకు చెందిన శ్రీ కడకుంట్ల గంగారాం గారు మరియు మార్గం రాజలింగం గారు. వీరంతా దాదాపు 50 సవత్సరాల క్రితం ఉమ్మడి కరీంనగర్ జిల్లా లోని, అప్పటి సిరిసిల్ల డివిజన్ నాయకులు గా ప్రాతినిధ్యం వహించి ఇప్పటి ఇబ్రహింపట్నం మండలం మరియు పరిసర గ్రామాలలో అనేక సేవలను అందించారు. వేములకుర్తి గ్రామంలో చుట్టుపక్కల వీరి ద్వారానే కమ్యూనిస్టు సంఘాల స్దాపన జరిగింది. వీరు గ్రామంలో




యువతను,ప్రజలను మంచి మార్గంలో నడిపించి,విలువలతో కూడిన జీవన విధానాలతో పార్టీని నిర్మించారు. నిత్య నూతన ఒరవడికి నాంది పలికి, ప్రజోపయోగ అంశాలపై ఎన్నో పోరాటాలు చేసి, విజయాలు సాధించి పలువురికి ఆదర్శంగా నిలిచారు. ఇలాంటి వ్యక్తులు ప్రజా జీవితంలో మైలురాయి లాంటి వారు. అన్ని పార్టీల కార్యకర్తలతో,నాయకులతో సత్సంబంధాలు కలిగిన నిన్నటి తరం అల్లంకొండ రాజన్న గారి మృతి తో ఇబ్రహీంపట్నం మండలంలో,గ్రామాల్లో సిపిఐ నాయకుల శకం ముగిసింది అని చెప్పక తప్పదు. అలుపెరుగని,రాజీలేని పోరాటాలతో సిద్ధాంత నిబద్ధతతో పని చేసిన దివంగత కమ్యూనిస్టు యోధులందరికీ పార్టీలకు అతీతంగా ప్రజలందరూ నివాళులు అర్పిస్తున్నారు. ఆ మహనీయుల ఆత్మలకు శాంతి చేకూరాలని ఆశిస్తూ..... కోరుట్ల నియోజక వర్గ కమ్యూనిస్టు కార్యకర్తలు ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు. అమరులైన ఈ కామ్రేడ్లకు అశ్రు నయనాలతో లాల్ సలాం లు అర్పిస్తున్నారు.

## బీరు పిట్ట బీరు పిట్ట తుర్రుమన్నది

**కరుణాకర్ మల్లిగారి, కరపత్రం ప్రతినిధి**

సంక్రాంతి పండగ ముందు తెలంగాణ మందుబాబులకు బ్యాడ్‌న్యూస్. ఇక నుంచి తెలంగాణలో కింగ్ ఫిషర్ బీర్లు కనిపించవంట. తెలంగాణకు కింగ్ ఫిషర్ బీర్లు, హెనికిన్ బీర్ల సరఫరాను నిలిపేస్తున్నట్టు యునైటెడ్ బ్రూవరీస్ సంస్థ ప్రకటించింది. తెలంగాణ బెవరేజస్ కార్పొరేషన్ తమ సంస్థకు బకాయిలు చెల్లించకపోవడం కారణంగానే బీర్ల సరఫరాను నిలిపేస్తున్నట్టు యునైటెడ్ బ్రూవరీస్ తెలిపింది. ఈ మేరకు.. సెబీకి యునైటెడ్ బ్రూవరీస్ లేఖ రాసింది. తెలంగాణ బెవరేజస్ కార్పొరేషన్ రూ.900 కోట్లు బకాయి ఉందని, 2019 నుంచి ధరలను సవరించకపోవడం లాంటి కారణాల వల్ల, భారీ నష్టాలు వస్తున్నాయని బ్రూవరీస్ తన లేఖలో వెల్లడించింది. బ్రూవరీస్ తీసుకున్న ఈ నిర్ణయంతో సంక్రాంతి పండగ ముందు.. రాష్ట్రంలోని కింగ్ ఫిషర్ బీర్ ప్రియుల బీరు బదులు నీరు పోసినట్టయింది. తెలంగాణలో మంచి అయినా, చెడు అయినా, బాధొచ్చినా, సంతోషం వచ్చినా,పండుగొచ్చినా పబ్బమొచ్చినా, చచ్చినా బతికినా, చివరికి ఎలక్షన్లు వచ్చినా.. ఇలా ఏ సందర్భమైనా ముందు మందుండాల్సిందే. తెలంగాణలో తాగటం అనేది అలవాటుపడిన ఓ సంప్రదాయమని దిల్ రాజు చెప్పినట్టు, చిన్నా పెద్దా అందరూ తాగుతారన్నది బహిరంగ రహస్యమే.




అయితే, వయసులో పెద్దవాళ్లు చాలా మంది ఎర్రమందు విస్కీ, బ్రాండీ, రమ్ లాంటి మద్యం సేవిస్తే.. యువత మాత్రం ఎక్కువగా తాగేది బీర్లే. అందులోనూ కింగ్ ఫిషర్ బ్రాండ్ బీర్లకు, మళ్లీ అందులో కింగ్ ఫిషర్ లైట్ బీర్లకు సపరేట్ ఫ్యాన్ బేస్ ఉంటుంది. మార్కెట్‌లో ఎన్నో పేర్లతో బీర్లు లభ్యమవుతున్నా.. చాలా మందికి బీర్ అంటే చాలు కింగ్ ఫిషర్ బీరే మొదటగా గుర్తొస్తుంది. కొంత మందికైతే.. కింగ్ ఫిషర్ బీర్ తప్ప మిగతా బ్రాండ్ల పేర్లు కూడా సరిగా తెలియదంటే అతిశయోక్తి కాదు. అలాంటి ప్రజాధరణ పొందిన కింగ్ ఫిషర్ బీర్లు ఇప్పుడు మొత్తానికే రావు అనే వార్త.. చాలా మంది, మందు యుగపు దూతలను ఆందోళనకు, ఆవేదనకు గురిచేయనుంది. సంక్రాంతి పండగ ముందు తెలంగాణ మందుబాబులకు కాస్త ఆందోళన కలిగించే వార్తను ప్రకటించింది యూనైటెడ్ బ్రూవరీస్ కంపెనీ. తెలంగాణకు తక్షణమే కింగ్ ఫిషర్ బీర్లతో పాటు హీనెకెన్ బీర్ల సరఫరాను నిలిపేస్తున్నట్టు ప్రకటించటం ఇప్పుడు రాష్ట్రంలో హాట్ టాపిక్‌గా మారింది. అయితే.. యునైటెడ్ బ్రూవరీస్ ప్రకటనపై తెలంగాణ ప్రభుత్వం స్పందించింది. తమను ఏమాత్రం సంప్రదించకుండానే సరఫరా నిలివేస్తున్నామని బహిరంగంగా ప్రకటించటంపై సర్కార్ సీరియస్ అయ్యింది. రాష్ట్రంలో ప్రజాధరణ కలిగిన కింగ్ ఫిషర్ బీర్ల సరఫరా నిలిపివేస్తే, మద్యం ప్రియులు ఆందోళన చెందుతారని, ఇదే అదునుగా చేసుకుని బెల్ట్ షాపులు అధిక ధరలకు అమ్మడాలు, వైన్ షాపులు బీర్ల కృత్రిమ కొరత సృష్టించే అవకాశాలున్నాయని ప్రభుత్వం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలోనే.. వైన్ షాపులకు రేవంత్ రెడ్డి సర్కార్ కఠిన ఆదేశాలు జారీ చేసింది. బ్రూవరీస్ ప్రకటన నేపథ్యంలో.. బీర్ల కృత్రిమ కొరత సృష్టించినట్టు తెలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని మద్యం దుకాణాలకు హెచ్చరికలు జారీ చేసింది. అధిక ధరలకు విక్రయించినట్టు తెలిసినా.. లైసెన్స్‌లు రద్దు చేస్తామని స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చింది.

# వయోవృద్ధులైనతల్లిదండ్రులనువిస్మ రించేవారు శిక్షార్హులే.

**......ఆర్డీవో ఎన్.శ్రీనివాస్.**



**కరపత్రం ప్రతినిధి,మెట్ పల్లి, జనవరి 8:** వయోవృద్ధులైన తల్లిదండ్రుల సంరక్షణ భద్రత కల్పించాల్సిన బాధ్యత పిల్లలదేనని,వారిని విస్మరించేవారు శిక్షార్హులేనని మెట్ పల్లి ఆర్డీవో ఎన్.శ్రీనివాస్ అన్నారు.బుధవారం మెట్ పల్లి డివిజన్ కేంద్రంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ మెట్ పల్లి డివిజన్ శాఖ కార్యాలయంను కళా నగర్ లో ఆర్డీవో,డి.ఎస్పీ లు ప్రారంభించారు.అనంతరం స్థానిక స్వర్ణకార సంఘ సమావేశ మందిరంలో సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ మెట్ పల్లి డివిజన్ శాఖ అధ్యక్షుడు ఒజ్జల బుచ్చిరెడ్డి ఆధ్వర్యంలో వయో వృద్ధుల సంక్షేమ,రక్షణ చట్టం పై అవగాహన సదస్సు నిర్వహించారు.అసోసియేషన్ ముద్రించిన 2025 క్యాలెండర్లను ఆర్డీవో శ్రీనివాస డి.ఎస్పీ ఏ రాములు ఆవిష్కరించారు. సీనియర్ సిటీజేన్స్ గుర్తింపు కార్డులను ఆర్డీవో,డి.ఎస్పీ,లు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథులుగా మెట్ పల్లిఆర్డీవోఎన్.శ్రీనివాస,డి.ఎస్.పి.రాములు, సీనియర్ సిటీజేన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్, లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీనివాస్ మాట్లాడుతూ వయో వృద్ధుల కోసం ప్రత్యేక టోల్ ఫ్రీ నెంబర్ 14567 ఉందని ,వారిని నిరాదరిస్తున్న,వేధిస్తున్న వారిపై ఫిర్యాదులు చేయవచ్చున్నారు.వేధింపులకు గురి చేసిన వారికి వయో వృద్ధుల సంరక్షణ చట్టం 2007 ప్రకారం 3 నెలల వరకు జైలు శిక్షతోపాటు జరిమానా విధించే వీలుందన్నారు. మెట్ పల్లి డి.ఎస్పీ రాములు మాట్లాడుతూ వయో వృద్ధులు సమాజ మార్గదర్శకులని,దేశ సంపద అని అన్నారు.పోలీసు శాఖ తరపున సీనియర్ సిటీజేన్స్ కు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు.సీనియర్ సిటీనేజెన్స్ రాష్ట్ర కార్యదర్శి హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో వయోవృద్ధుల సమస్యల పరిష్కారానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపు పొందిన ఏకయిక సీనియర్ సిటీజేన్స్ అస్సోసియేషన్ తమదేనన్నారు. తమ అస్సోసియేషన్ ప్రతినిధులు జిల్లాలో వయోవృద్ధుల సంరక్షణ చట్టం అమలులో ప్రభుత్వం కు సహకరిస్తూ తల్లిదండ్రులను నిరాదరిస్తున్న కొడుకులు,కూతుర్లు,కోడళ్లకు కౌన్సెలింగ్ లు చేస్తూ వారి సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తున్నామన్నారు. .ఆదర్శ ప్రజా ఆర్డీవో గా మెట్ పల్లి ఆర్డీవో కొద్ది కాలానికే పేరు తెచ్చికున్నారని,వయోధికుల కేసుల పరిష్కారం లో నెంబర్ వన్ గా నిలిచారని కొనియాడారు. .శాంతిభద్రతల పరిరక్షణ లో డి.ఎస్పీ రాములు సేవలు ఆదర్శనీయమన్నారు. , ఇటీవల వయోవృద్ధుల సంరక్షణ చట్టం 2007 నియమావళి 2011 లో సవరణలకు తమ రాష్ట్ర అధ్యక్షుడు పి.నర్సింహ రావు అభ్యర్థన మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వృద్ధులకు మరింత భరోసా కల్పించేందుకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ రాష్ట్ర కార్యదర్శి,జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్, జిల్లా సీనియర్ సిటీజేన్స్ ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం,కోశాధికారి వి.ప్రకాష్ రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి పూసాల ఆశోక్ రావు,ఉపాధ్యక్షులు పి.సి.హన్మంత్ రెడ్డి, ,ఎం.డి.యాకూబ్, మెట్ పల్లి డివిజన్ అధ్యక్షుడు ఒజ్జల బుచ్చిరెడ్డి,కార్యదర్శ సౌడాల కమలాకర్, వెల్ముల ప్రభాకర్ రావు, ఎం.స్వామి, పబ్బా శివానందం, రాజ్ మోహన్,స్వర్ణకార సంఘం అధ్యక్షుడు నాంపల్లి సింహాద్రి, మనుమయ సంఘం అధ్యక్షుడు పి.చంద్రయ్య, మెట్పల్లి,ఇబ్రహీంపట్నం,మల్లాపూర్ మండలాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ప్రియాంక గాంధీ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిజెపి మాజీ ఎంపీ రమేష్ దిష్టిబొమ్మ దగ్ధం.



**కరపత్రం ప్రతినిధి, మెట్ పల్లి, జనవరి 8.** కాంగ్రెస్ పార్టీ ఎంపీ ప్రియాంక గాంధీ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిజెపి మాజీ ఎంపీ రమేష్ బిదురి ని వెంటనే బిజెపి పార్టీ నుండి సస్పెండ్ చేయాలని బిజెపి రాష్ట్ర కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసిన యువజన కాంగ్రెస్ శ్రేణులపై బిజెపి గుండాల దాడికి నిరసనగా తెలంగాణ రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు బుధవారం జక్కిడి.శివ చరణ్ రెడ్డి ఆదేశాల మేరకు మెట్పల్లి పాత బస్టాండ్ శాస్త్రి చౌరస్తా వద్ద కోరుట్ల నియోజవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పెంట ప్రణయ్ తేజఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నియోజవర్గంలోని నాలుగు మండలాలలో నిరసన తెలిపి బిజెపి పార్టీ దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది.ఈ సందర్భంగా పెంట ప్రణయ్ కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ మహిళల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన బిజెపి నాయకుడినీ పార్టీ సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ఇట్టి నిరసన కార్యక్రమంలో కోరుట్ల నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంట ప్రణయ్ తేజ,జిల్లా ఉపాధ్యక్షుడు అమ్ముల రాహుల్, మిట్టపల్లి భూమేష్, రాహుల్, పట్టణ యూత్ అధ్యక్షుడు జెట్టి లక్ష్మణ్, బీర్కుల విజయ్, సుంకే ప్రసాద్, సంజీవ్, కైలాష్, ప్రేమ్, రాజ్, కృష్ణ, శివ,సల్మాన్,యువజన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిఎంపిఎఫ్, కో-ఆర్డినేషన్ పిఎఫ్, పెన్షన్ ఆధాలాత్ సమస్యల పరిస్కారంకై సమీక్షా సమావేశం...

**- అర్జీ -1 జియం. లలిత్ కుమార్**




**కరపత్రం రామగుండం జనవరి, 08:**

రామగుండం ఏరియా -1 మరియు పి.ఎఫ్,పెన్షన్ అదాలత్" సంబందించిన సమస్యల పరిష్కారం కోసం సమీక్ష సమావేశం నిర్వహించటం జరిగింది. ఇట్టి సమీక్ష సమావేశానికి అర్.జి.1 జిఎం శ్రీ లలిత్ కుమార్ గారు అధ్యక్షత వహించటం జరిగింది. ఈ సమీక్షా సమావేశంలో రిజియనల్ కమిషనర్ సిఎంపిఎఫ్, గోదావరిఖని శ్రీ హరి పచౌరి ముఖ్య అతిధి గా హాజరు అయ్యారు. ఈ సమావేశంలో ఎన్.సి.డబ్యు.ఎ ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ సంబందిత సమస్యల పరిష్కార మార్గం, పెన్షన్ చెల్లింపు, పెన్షన్ సెటిల్‌మెంట్ మరియు పెన్షన్ల సవరణ, ఎన్.సి.డబ్ల్యు.ఎ-లేవన్ రివైజ్డ్ పెన్షన్ క్లెయిమ్‌లు. ఎన్.సి.డబ్ల్యు.ఎ ఉద్యోగులు, కాంట్రాక్ట్ వర్క్ మెన్ యొక్క సి.ఎం.పై.ఎఫ్ ఆడిట్ షీట్, కాంట్రాక్ట్ డ్రైవర్లకు సిఎంపిఎఫ్ నంబర్లు జారి సమస్య, ఎగ్జిక్యూటివ్ పెన్షన్ బకాయిలు, కాంట్రాక్ట్ ఉద్యోగి యొక్క మాస్టర్ డేటా సి-కేర్స్ (సి. కేర్స్ ) పోర్టల్‌లో అప్‌లోడ్ సంబందిత సమస్యల పరిష్కారం, కొత్తగా చేరిన ఉద్యోగులకు కొత్త సిఎంపిఎఫ్ కేటాయింపు, ప్రావిడెంట్ ఫండ్ మరియు ఉద్యోగుల పెన్షన్ తదితర విషయాల గురించి రిజియనల్ కమిషనర్ సిఎంపిఎఫ్, గోదావరిఖని గారికి వివరించటం జరిగింది.ఈ సందర్భంగా అర్.జి.1 జిఎం శ్రీ లలిత్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులు పదవీ విరమణ అనంతరం సిఎంపిఎఫ్ నిది అందటం లో ఆలస్యం కాకుండా చూడాలని, పదవీ విరమణ అయిన వెంటనే సిఎంపిఎఫ్ నిది ఉద్యోగికి త్వరిత గతిన అందేలా చూడాలని అన్నారు. ప్రతి సంవత్సరం ఉద్యోగికి సిఎంపిఎఫ్ జమ చిట్టిలను అందేలా చూడాలని అన్నారు. సిఎంపిఎఫ్ పెండింగ్ కేసులను త్వరిత గతిన పూర్తి చేయుటకు కృషి చేయాలని అన్నారు. సిఎంపిఎఫ్ నిధి అనేది ప్రతి ఉధ్యోగికి అతి ముఖ్య మైనది అని రిటైర్ మెంట్ తర్వాత ఈ నిధి వారికి, వారి కుటుంబ సభ్యులకు ఎంత గానో ఉపయెగపడుతుందని అన్నారు.ఈ కార్యక్రమంలో యస్.ఓ.టు జిఎం గోపాల్ సింగ్, ఎఐటియుసి బ్రాంచి సెక్రటరీ అరెల్లి పోషం, పర్సనల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, సిఎంఓఎఐ క్రాంతి కుమార్, డిజియం ఫైనాన్స్ ధనలక్ష్మి భాయి, సీనియర్ పర్సనల్ అధికారులు శ్రావణ్ కుమార్, హనుమంత రావు పాల్గొన్నారు.

# మూర్మూర్ మాజీ ఎంపీటీసీ కొక్కెర రమేష్ ఆధ్వర్యంలో గ్రామ యాదవ సంఘం ఎన్నిక...

**మూర్మూర్ యాదవ్ సంగం గ్రామ అధ్యక్షులుగా గోపు కుమార్ ఏకగ్రీవ ఎన్నిక..**

**కరపత్రం రామగుండం జనవరి, 08:** పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండల కేంద్రంలోని మూర్మూర్ గ్రామంలో ముర్మూర్ తాజా మాజీ ఎంపీటీసీ కొక్కెర రమేష్ యాదవ్, గ్రామ మాజీ అధ్యక్షులు గోపు మల్లేష్ యాదవ్ ఆధ్వర్యంలో మూర్మూర్ గ్రామ యాదవ సంఘం అధ్యక్షులుగా ఎన్నుకోవడం జరిగిందని మురుమూరు తాజా మాజీ ఎంపిటిసి కొక్కెర రమేష్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా మూర్మూర్ తాజా మాజీ ఎంపీటీసీ కొక్కెర రమేష్ యాదవ్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నుకోబడినటువంటి గ్రామ యాదవ సంఘం కమిటీ సభ్యులు ప్రతి ఒక్కరు కూడా మన గ్రామంలోని యాదవ సంఘం కుటుంబంలోని ఎవరికి ఏ ఆపద వచ్చినా అందరం కలిసికట్టుగా ఉండి వారి కుటుంబాన్ని ఆదుకోవాలని అలాగే యాదవ్ సంఘం కు ఎల్లవేళలా వెన్నుముకలా ఉండి యాదవ్ సంగం ను ముందుకు తీసుకు వెళ్లే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అంతర్గం తాజా మాజీ ఎంపీటీసీ కొక్కెర రమేష్ యాదవ్ తెలిపారు. నూతనంగా ఎన్నుకోబడిన యాదవ సంఘం గ్రామ కమిటీ అధ్యక్షులుగా గోపి కుమార్, ఉపాధ్యక్షులుగా నక్క శంకర్, కోశాధికారి కొక్కెర శ్రీకాంత్, కమిటీ సభ్యులు గోపు శ్రీశైలం అర్కల తిరుపతి, వేంపల్లి చంద్రయ్య, మూచర్ల గట్టయ్య, యాగండ్ల పోచయ్య, మాజీ అధ్యక్షులు గోపు మల్లేష్ యాదవ్, కొక్కెర రమేష్ యాదవ్, గ్రామంలోని యాదవ సంఘం పెద్దలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



## చైనా మంజాను విక్రయించిన అమ్మిన చట్టపరమైన చర్యలు తప్పవు.

**– మెట్ పల్లి ఎస్సై కిరణ్ కుమార్.**

**కరపత్రం ప్రతినిధి, మెట్ పల్లి, జనవరి 8 .**




జగిత్యాల జిల్లా మెట్పల్లి మండలం లోని గ్రామాల పరిధిలో చైనా మాంజా పై నిషేధం ఉందని ఎవరైనా చైనామ మాంజావల్ల ఎవరికైనా ప్రమాదం జరిగిన వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని మంగళవారం మెట్ పల్లి ఎస్సై కిరణ్ కుమార్ రణం ప్రతినిధితో అన్నారు. సంక్రాంతి సెలవులు సమీపిస్తుండడంతో చైనా మాంజా ను ఎక్కువగా వినియోగించే అవకాశం ఉన్నందున పిల్లలు వాటిని విక్రయించవద్దని ఎస్ఐ అన్నారు. విక్రయించే దుకాణాలపై తనిఖీలు నిర్వహిస్తామని వాటిలో దుకాణంలో చైనా మాంజాను కనిపిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని దుకాణం యజమానులను హెచ్చరించారు . నైలాన్ సింథటిక్ దారాలతో తయారు చేసే ఈ చైనా మాంజాతో పర్యావరణానికి విపత్తుగా మారడంతో జాతీయ హరిత ట్రిబ్యునల్ ఆదేశాలను పాటించాలని అన్నారు. చైనా మాంజా ఏడేళ్ల జైలు, పదివేల జరిమానా విధించనున్నట్లు ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. చైనా మాంజను వాడ వద్దని ఎస్ఐ కిరణ్ కుమార్ పిల్లలను కోరారు. పతంగులు ఎగిరేసేటప్పుడు మి ద్దెల పైన జాగ్రత్తగా ఉండి ఎగురవేయాలని అన్నా రు. మిద్దెల పైనుంచి పతంగులను ఎగురవేయడం కరెంటు వైర్ తీగలను చూసుకొని ఎగరవేయాలని అన్నారు. గతంలో కరెంట్ షాక్ తగిలి మృతి చెందిన సందర్భాలు రాష్ట్రంలో ఎన్నో ఉన్నాయని గుర్తు చేశారు. మిద్దెల పైన పహారి గోడలు ఉన్న ప్రదేశాలలో మాత్రమే పతంగులను ఎగురవేయాలని అన్నారు.

# హమాలి కార్మిక సంఘ నేత లస్మయ్య మృతి తీరని లోటు

**కరపత్రం న్యూస్ కోరుట్ల: జనవరి8**



ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు సుతారి రాములులి కోరుట్ల డివిజన్లోని హమాలీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను ఎర్రజెండా కమ్యూనిస్టు పార్టీకి దృష్టికి తీసుకువచ్చి పేద కార్మికుల సమస్యలు పరిష్కరించాలని లక్ష్మయ్య కోరిన పిమట వెంటనే అలమయ్య గుట్ట ప్రాంతంలో పేద వాళ్ళందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలని ఎన్నోసార్లు ఆందోళన కార్యక్రమం చేపట్టడం వల్ల రేషన్ కార్డులు లభించింది అని తెలిపారు అలాగే వీళ్ళందరికి కూడా నీడ కావాలని అనగా ఇండ్లు ప్రభుత్వం ఇస్తా అని హామీ ఇచ్చిన మేరకు ఇల్లు నిర్మించి ఇవ్వాలని అనేకసార్లు గత దశాబ్ద కాలం నుంచి ఏ పార్టీలో ఉన్న నాయకులైన సరే పోరాటాలు చేస్తూ ఉద్యమాలు చేస్తూ ఇల్లు కావాలని ఆందోళన చేసిన పిమ్మట వారందరికీ ఇళ్ల స్థలాలు సాధించిన ఘనత వీరికి ఉందని పేర్కొన్నారు అదే బాటలో కార్మికులందరికీ పెరుగుతున్న ధరలకు అనుకూలంగా కూలి రేట్లు పెంచాలని వ్యాపార వారిద్ద యజమాలతో ఎర్రజెండా నాయకత్వం పోరాటాలు సలిపిన వ్యక్తి లక్ష్మయ్య అని ఆయన సేవలు కొనియాడారు ఆయన లేని లోటు ఇప్పటికి కూడా కోరుట్లలో కనిపిస్తుందని ఆయన ఆశ సాధన కోసం మనమంతా కృషి చేయాలని కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు ఈ సమావేశంలో హమాలీ కార్మిక సంఘం నాయకులు కళ్లెం సాయిలు చిత్తారి రాము శ్రీనివాస్ గంధం దశరథం రాములు శ్రీనివాస్ చిత్తరి శ్రీనివాస్ కళ్లెం సాయిలు గంధం దశరథం గంధం గంగాధర్ కౌన్సిలర్ నూనె నారాయణ నూనె రోశయ్య ఈర్నాల ఇస్తారు నూనె పోసేట్టి నూనె రాములు తదితరులు పాల్గొన్నారు

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన మోహన్ నాయక్

**కరపత్రం నిజాంపేట ప్రతినిది....**



నిజాంపేట మండల పరిధిలోని కల్వకుంట గ్రామనికి చెందిన ఊషనోళ్ల రామయ్య కొన్ని రోజుల క్రితం అనారోగ్య కారణాలతో మరణించడం జరిగింది. ఇట్టి విషయం తెలుసుకున్న లీల గ్రూప్ చైర్మన్ డాక్టర్ మోహన్ నాయక్ మృతుని ఆ కుటుంబాన్ని పరామర్శించి 5000 రూపాయలు ఆర్థిక సాయంతో పాటు 25 కిలోల బియ్యం అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో.గుగ్లొత్ జైల్సింగ్ నాయక్. గుగ్లొత్ శ్రీను నాయక్.మాలోత్ సుభాష్ నాయక్.గుగ్లోత్ బాబులాల్.రాజేశ్వర్ రెడ్డి. ప్రశాంత్, పావులు మల్లేశం, రాజు, రమేష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## మృతుల కుటుంబాలను పరామర్శించిన టి ర్ స్ నియోజక ఇన్చార్జి

**కరపత్రం నిజాంపేట్ ప్రతినిది...**



నిజాంపేట మండల పరిధిలోని రాంపూర్, నస్కల్ గ్రామాలలో బుధవారం రోజున టిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జి కంటరెడ్డి తిరుపతిరెడ్డి మృతుల కుటుంబాలను పరామర్శించారు. రాంపూర్ గ్రామానికి చెందిన చేకూరి చంద్రయ్య, సౌడ బాలరాజు కుటుంబాలను పరామర్శించి మనోధైర్యం కల్పించారు. అనంతరం నస్కల్ గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు నర్సా గౌడ్ ఈ మధ్యకాలంలో అనారోగ్యంతో మరణించడంతో ఆ కుటుంబాన్ని పరామర్శించి ఆ కుటుంబానికి మనోధైర్యాన్ని కల్పించి, వారికి ఆర్థిక భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో చింతల స్వామి, అందే కొండల్ రెడ్డి,మహమ్మద్ గౌస్, నగేష్ యాదవ్,పాతూరి బాల్ రెడ్డి, కొమ్మిడి హనుమంత రెడ్డి, మహిళలు గ్రామస్తులు పాల్గొన్నారు.